క్లుప్తంగా

బీసీజీ టీకాలతో ఆరోగ్య సంరక్షణ



ఉయ్యూరు: బీసీజీ టీకాలతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని కాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ అన్నారు. కాటూరు పీహెచ్‌సీలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు బీసీజీ టీకాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే బీసీజీ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో ఇంటింటికీ సురక్షిత తాగునీటిని వాటర్ ట్యాంకులు, మోటారు బోర్లు, పైప్‌లైన్ విస్తరణ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో నాలుగు వాటర్ ట్యాంక్‌లు, గ్రామం మొత్తం పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో ఈ నిధులతో నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపడతామని పేర్కొన్నారు.

అందరి సహకారంతో క్రీడా ప్రాంగణం అభివృద్ధి



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు. గురువారం ఆయన క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న రోలింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయడంతో పాటు చుట్టూ ఎల్‌ఈడీ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో ట్రాక్ చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించేందుకుగాను మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. వేసవి దృష్ట్యా ప్రతి రోజూ వాకర్స్‌తో పాటు ఆడుకునేందుకు వచ్చే పిల్లలకు దాతల సహకారంతో మజ్జిగ, రాగిజావ, పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా వాలీబాల్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ఔత్సాహికులైన క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో వాకర్స్‌కు ఆరోగ్య, ఆహార పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెనమలూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో హైస్కూల్ సమీపంలో ఉంటున్న అవిర్నేని శివనాగేశ్వరరావు తన ఇంటి ముందు ఉన్న సమయంలో ఎదురింట్లో ఉండే టి.ఫణీంద్ర మద్యం సేవించి వచ్చి అకారణంగా శివనాగేశ్వరరావుతో తగాదాపడి దాడి చేశాడు. ఈ ఘటన పై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

టీడీపీ నేతలపై కేసు

పెనమలూరు: ఎన్నికల రోజు టీడీపీ నేతలు హల్‌చల్ చేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల సమయంలో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్, అతని సోదరుడు బోడె సురేష్, నేతలు ఆచంట చంటి, వి.పవన్, భార్గవ్, వీరుయాదవ్ మరికొందరు ఓటర్లను ఓట్లు వేయనీయకుండా గలాటా సృష్టించారని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు టీడీపీ నేతలపై కేసు నమోదు చేశారు.

నేడు చినకంచిలో సీతామాత జయంతి వేడుకలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో శుక్రవారం సీతామాత జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాములకు ప్రత్యేక పూజ, వైశాఖ శుద్ధ నవమి సందర్భంగా ఉదయం శ్రీచక్ర నవావరణార్చన, బాలాపూజ, సువాసినీ పూజలు జరుగుననని శర్మ తెలియజేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని సీతారాముల ఆశీస్సులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఓటు కీలకమే

- నియోజకవర్గంలో 71 సర్వీస్ ఓట్లు
- మారనున్న పోలింగ్ శాతం



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు



పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి వచ్చిన ఉద్యోగులు(ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో ఎన్నికలు పోటా పోటీగా జరగడంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. నియోజకవర్గంలో మొత్తం 2,94,928 ఓట్లు ఉన్నాయి. అయితే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 2,33,352 ఓట్లు పోల్ అయ్యాయి. అంటే 79.12 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. అయితే పోస్టల్ బ్యాలెట్, హోం ఓటర్లు, సర్వీస్ ఓటర్లను మొత్తం పోల్ అయిన ఓట్ల శాతంలో అధికారులు చూపలేదు. తాజాగా సేకరించిన వివరాల ప్రకారం పెనమలూరు నియోజకవర్గంలో స్థానిక పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,162, హోం ఓట్లు 367, ఇతర జిల్లాల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,058 కలిపి మొత్తం 3,587 ఓట్లు పోల్ అయ్యాయి. జనరల్ పోలింగ్‌లో పోల్ అయిన 2,33,352కి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3,587 కలిపితే మొత్తం పోల్ అయిన ఓట్లు 2,36,939 అయ్యాయి.

సర్వీస్ ఓట్లు తేలాల్సి ఉంది..

కాగా పై ఓట్లతో పాటు ఇంకా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ ఓట్లు కూడా తేలాల్సి ఉంది. దేశవ్యాప్తంగా ఆర్మీలో పని చేస్తున్న వారు పెనమలూరు నియోజకవర్గంలో 71 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకు వీరి నుంచి 11 ఓట్లు మాత్రమే అధికారులకు అందాయి. ఇంకా 60 ఓట్లు అందాల్సి ఉంది. కౌంటింగ్ ముందు రోజు వరకు సర్వీస్ ఓట్లు స్వీకరిస్తారు. అన్నీ అందిన తర్వాత పోల్ అయిన 2,36,939 ఓట్లకు సర్వీస్ ఓట్లు కలిపితే ఫైనల్ ఓట్లు పడిన లెక్క తేలుతుంది. అప్పుడు పోలింగ్ శాతం కూడా మారుతుంది.

దోమల నిర్మూలనతో డెంగ్యూ వ్యాధి నివారణ



కాటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఉప్పలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఉయ్యూరు: దోమల నిర్మూలనతో డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని కాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరామకృష్ణ అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కాటూరు పీహెచ్‌సీ పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో శివరామకృష్ణ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజ అన్నారు. మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప్పలూరు ప్రధాన వీధుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రదర్శన నిర్వహించి దోమల వ్యాప్తి అరికట్టే చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధా ప్రసూజ మాట్లాడుతూ దోమల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజు, ఎంపీహెచ్‌ఈఓలు శ్రీనివాసరావు, కృష్ణారావు, సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో భగవద్గీతను శ్రద్ధగా వింటున్న చిన్నారులు

కంకిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం ప్రత్యేక వినోద కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ పొందారు. భగవద్గీత శ్లోకాలను శ్రద్ధగా ఆలకించారు. క్రీడా శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు గానూ గ్రంథాలయ సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నామని వివరించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు, ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను గురువారం నిర్వహించారు. జూన్ 17వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఉంగుటూరు గ్రంథాలయ అధికారి యూ.చంద్రశేఖర్ తెలిపారు. శిక్షణా తరగతులు ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. పిల్లలు అందరూ గ్రంథాలయాల్లోని వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ గూండాల దాడి అమానుషం



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కనకారావు

గుణదల(విజయవాడతూర్పు): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై టీడీపీ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించడం అమానుషమని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుణదలలోని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం బీసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని అల్లర్లు చేస్తూ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొల్పుతున్నారన్నారు. రాయచోటిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించడం దారుణమన్నారు. వెంకటేశ్వర్లు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవడమే తప్పా అని ప్రశ్నించారు. టీడీపీ అల్లరిమూకలు వెంకటేశ్వర్లు ఇంటిపై ఇనుప రాడ్లు, కర్రలతో విరుచుకుపడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న అక్కసుతో ఈ విధంగా ప్రవర్తించారన్నారు. మీరెన్ని దాడులు, అల్లర్లు చేసినా రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తెలిపారు. సీఎంగా మళ్లీ జగనన్న ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ విధ్వంసానికి కారణమైన టీడీపీ గూండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీ కనకదుర్గ విజయవాడ నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ద్రాక్ష రాము, ఉపాధ్యక్షుడు రాయవరపు గణపతి, పాలకవర్గ సభ్యులు ఎలమంచిలి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు గోల్కొండ వాసు పాల్గొన్నారు.

బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం



బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం వైశాఖ మాసం పురస్కరించుకుని సాయినాథుడు, శ్రీ మరకత పోలిన శ్రీ భవానీ శంకరస్వామి వారికి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి చేతులమీదుగా మామిడి పండ్ల రసంతో అభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు మామిడి పండ్లు తీసుకొచ్చి మామిడి పండ్ల రసంతో బాబావారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ ఏటా తాము లోక కల్యాణార్థం భక్తులు, దాతల సహకారంతో వైశాఖ మాసంలో బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. మందిర సంయుక్త కార్యదర్శి విష్ణు వర్ధన్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామానికి చెందిన పోలవరపు ఝాన్సీ, పోలవరపు వాల్మీకి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. కాగా గన్నవరంకు చెందిన గూడపాటి శ్రీనివాసరావుకు వాల్మీకి దంపతులు రూ. 2 కోట్లకు పైగా అప్పు ఇచ్చారు. అప్పు తీసుకున్న శ్రీనివాసరావు సొమ్ము తిరిగి చెల్లించలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో వాల్మీకి ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భర్త కోసం వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. కాగా భర్త వాల్మీకి రాసిన లెటర్ 15వ తేదీన భార్య ఝాన్సీకి అందింది. తన కోసం వెతకవద్దని అందులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత దంత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వాకర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీఆర్ కిషోర్, డాక్టర్ లోయ సురేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరంలోని స్టార్ డెంటల్ క్లినిక్‌కు చెందిన వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని వాకర్స్‌తో పాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్చరీ క్రీడాకారుడికి సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 10+2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ఆర్చరీ క్రీడాకారుడు భూటాన్ గ్రాండ్ ఫిక్స్–2 విజేత పెండ్యాల త్రినాథ్ చౌదరి గురువారం అధ్యాపకుడు పులుగు దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్చరీ శిక్షణలో బిజీగా ఉన్న తనకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి సీబీఎస్‌ఈ 10+2 పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి సహకరించారని తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన భూటాన్ గ్రాండ్ ఫిక్స్–2 పోటీల్లో విజేతగా నిలిచిన ఆర్చరీ క్రీడాకారుడు పెండ్యాల త్రినాథ్‌చౌదరిని, పులుగు దీపక్‌ను సత్కరించి అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై గురువారం దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ, పూజల్లో ఈఓ రామరావు పాల్గొన్నారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, ఇతర ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో పూజ జరిపించుకున్నారు.

ముగిసిన బాబా మందిర వార్షికోత్సవాలు



సాయిబాబా పల్లకీ సేవ

మధురానగర్(విజయవాడ సెంట్రల్): విజయవాడ మధురానగర్ మెయిన్ రోడ్డులోని శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు వలివేటి శ్రీనివాస శర్మ బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాబావారిని ఉంచి సముద్రవేణి కోలాట మహిళా బృందం కోలాట నృత్యాలతో ఊరేగింపు భిక్షాటన చేశారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం లలితా పరమేశ్వరి ఆధ్వర్యాన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, అధ్యక్షుడు వైవీ శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు, కె.శ్రీనివాస్ కోనేరు మంజులవాణి తదితరులు పర్యవేక్షించారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

- ఒక్కొక్కరికి వంద రోజుల పనిదినాలు
- పలు చెరువుల్లో పూడిక తీసే పనులు



నున్న గ్రామంలో నీటికుంట తవ్వకం పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని సాగు చేసే పంట పొలాలకు సాగునీరు వెళ్లే విధంగా పంట బోదె తవ్వకం పనులు, చెరువుల్లో వర్షం నీరు నిల్వ ఉండేలా చెరువు పూడిక పనులు జరుగుతున్నాయి. రైతుల పొలాల్లో నీటి కుంట తవ్వకం పనులు చేస్తున్నారు. నున్న గ్రామంలో వజ్రాల నాగిరెడ్డి పొలంలో నీటి కుంట తవ్వకం పనులు జరుగుతున్నాయి. ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించే దిశగా అనగా ఒక్కొక్క కూలీకి వంద రోజుల పనిదినాలు లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం చెరువులు ఉన్న గ్రామాల్లో అనగా నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, పైడూరుపాడు గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు ముమ్మరంగా చేస్తున్నారు. నున్న, పాతపాడు, పైడూరుపాడు గ్రామాల్లోని చెరువుల్లో పూడిక తీసే పనులు సాగుతున్నాయి. పంట బోదె తవ్వకం పనులకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆరు మీటర్ల పొడవు, మీటరున్నర వెడల్పు, అడుగులోతు చొప్పున తవ్వకం పనులు చేసిన ప్రతీ కూలీకి రూ. 276 నుంచి 300 వరకు వేతనం లభిస్తోంది. ప్రతి కూలీ రెండు పూటలు పని చేస్తున్నట్టుగా ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా అటెండెన్స్ తీసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది. అదేవిధంగా ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులు డీబీటీ (నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు) జమ చేసే విధానం అమలు జరుగుతుంది. ప్రతి వారం ఉపాధి కూలీలకు బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నట్లు ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు తెలియజేశారు. మండలంలో మొత్తం 1,850 మంది ఉపాధి కూలీలు వివిధ గ్రామాల్లో పనులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు

- మండలంలోని మహిళలకు రూ. 15.20 కోట్లు విడుదల
- 15,974 మందికి చేకూరిన లబ్ధి



గన్నవరంలో సమావేశం నిర్వహించిన డ్వాక్రా మహిళలు(ఫైల్)

గన్నవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు చేసిన మేలుకు మహిళా లోకం నీరాజనాలు అందిస్తోంది. బుధవారం రాత్రి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు మంజూరు కావడంతో మహిళలు మనసున్న మహారాజు సీఎం జగనన్న అని కొనియాడుతున్నారు. గన్నవరం మండలంలోని 45 విలేజ్ ఆర్గనైజేషన్స్‌లోని పరిధిలోని 1,604 గ్రూపులకు రూ. 15 కోట్ల 20లక్షలకు పైగా నగదు వారి గ్రూపుల్లోని అకౌంట్లలో జమ కావడంతో వారి సంతోషానికి అవధులు లేవు. 15,974 మంది మహిళలు మండలంలో నేరుగా ఈ లబ్ధిని పొందారు. మండలంలోని ఆదర్శ వీవో(విలేజ్ ఆర్గనైజేషన్)కు 91 గ్రూపులుండగా 901 మంది సభ్యులున్నారు. వీరికి రూ. 82.54 లక్షలు పైగా నగదు జమ అయ్యింది. చిన అవుటపల్లిలో 350, దావాజీగూడెం 233, జక్కులనెక్కలం 214, మదర్ థెరిస్సా 465, పవిత్రి 290, పవిత్ర 443, ప్రగతి 296, శ్రమజీవన 188, స్వర్ణ 277, తంబి 71, ఉజ్వల 451, ఆదర్శ 901, అరుంధతి 630, భవిత 427, చరిత 723, జాగృతి 446, కృషి 408, మర్లపాలెం 241, నవోదయ 503, సాధన 367, వీఎన్ పురం 189, విజేత 192, అంబేడ్కర్ 292, బీబీ గూడెం 328, చైతన్య 250, గాంధీజీ 133, గొల్లనపల్లి 693, మాదలవారిగూడెం 171, మదర్‌థెరిస్సా 399, సంఘమిత్ర 599, సిరి 191, స్నేహ 338, తేజ 666, బల్లిపర్రు 186, గీత 325, ఝాన్సీ 131, కొత్తగూడెం 251, మెట్లపల్లి 156, ముస్తాబాద–2 615, సమత 151, సుగాలి 133, స్వాతి 167, తెంపల్లి 504, వీరపనేనిగూడెం 421, వెన్నెల 569 మంది మహిళలు మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిని పొందారు.

శృతిలయ సమన్వితం.. త్యాగరాజ సంకీర్తనం



సంగీతోత్సవంలో భక్తిగా త్యాగరాజ కృతులను గానం చేస్తున్న రఘునాథరావు

విజయవాడకల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు కచేరీలో పాల్గొని ఉత్సవాలకు శోభను అందిస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో కె.శర్వాణి, శృతిలయ నివాస్ విద్యార్థులు, మంత్రప్రగడ దుర్గా ప్రమీల, కె.శ్రీవిద్య, కె.అనిల్‌కుమార్ డీవీఆర్ సీత, పోపూరి శ్యామసుందర్, వీరుభట్ల సీతారమణి, గండూరి లక్ష్మీహర్షిత, సాయి కృష్ణ కౌశిక్, ముళ్లమూడి శ్రీనిధి, విష్ణుభొట్ల సోదరీమణులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. కేఎస్ గోవిందరాజన్ వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. సంగీతోత్సవంలో ఆరు సంవత్సరాల శర్వాణి నుంచి 85 సంవత్సరాల రఘునాథరావు పాల్గొనడం విశేషం. సంగీత కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగడి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ద్వాదశ వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి సన్నిధిలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి తిరుమంజనం చేసి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం మధ్యాహ్నం - స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవచనం, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం తదితర కార్యక్రమాలను అర్చకులు వివరించారు. అనంతరం కన్యాదానం, మాంగల్యధారణ, తలంబ్రాల సమర్పణ నిర్వహించారు. సాయంత్రం వివిధ వాహనాలపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి పూజలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవను కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రముఖుడు గొల్లపూడి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆలరించింది. సీనియర్ గాయకుడు బాలాజీ కుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు సుధారాణి, లక్ష్మీ దుర్గ, దుర్గ, నాగలక్ష్మి, గెల్లి సువర్ణ, బోయిన వేణుగోపాల్, గాయత్రి శర్మ, విజయశ్రీ గుప్తా తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. బాలాజీ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.